# గాలివాన బీభత్సం



నస్రుల్లాబాద్-తిమ్మాపూర్ ప్రధాన రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం

- విరిగిన చెట్లు.. కూలిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు
- రోడ్డుపైనే నిలిచిన వాహనాలు
- కరెంట్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/బాన్సువాడ/నస్రుల్లాబాద్, జూన్ 10: జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గ్రామాల్లో పలువురి ఇంటిపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామం వద్ద పెద్ద ఇప్పచెట్టు రోడుపై కూలిపోయింది. రాత్రి సమయం కావడం.. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టు రోడ్డుపై కాకుండా పక్కనే ఉన్న నివాస గృహాలపై పడినా ప్రాణనష్టం సంభవించేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. చెట్టు కూలిన తరువాత ఆ మార్గంలో వస్తున్న లారీ రోడ్డు దిగి దాటడానికి ప్రయత్నించడంతో మట్టిలో దిగబడిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సమాచారం అందుకున్న ఏఎస్సై నరేందర్ పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని, హాజీపూర్ గ్రామస్తుల సహకారంతో చెట్టుకొమ్మలను కొంతభాగం రోడ్డుపై నుంచి తొలగించడంతో రాకపోకలు యధావిధిగా ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి పోలీసులు వచ్చి చెట్ల కొమ్మలు తొలగించడంతో ప్రజలు అభినందనలు తెలియజేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు కూడా ఆర్అండ్బీ అధికారులు నిర్లక్ష్యం వహించి రోడ్డుపై అలాగే ఉన్న సగం ఇప్పచెట్టును పూర్తిగా తొలగించకపోవడంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తంచేశారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో చెట్లు నేలకొరిగాయి. మండలంలోని మెంగారం గ్రామ శివారులో ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లింగంపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై సైతం చెట్లు కూలిపోయినట్లు వాహనదారులు తెలిపారు. సోమవారం రాత్రి కురిసిన వర్షం 27.4 ఎంఎంగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వరుసగా రెండు రోజులపాటు వర్షం కురియడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు. బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, పీఎస్ఆర్ జర్నలిస్టు కాలనీ, వైకుంఠధామం వద్ద, శ్రీరామ, టీచర్స్, చైతన్య తదితర కాలనీల్లో వీచిన బలమైన ఈదురు గాలులకు ఎక్కడికక్కడ చెట్లు విరిడిపడ్డాయి. దుకాణాల ఎదుట ఉన్న డబ్బాలు, ఫాస్టు ఫుడ్ సెంటర్ డబ్బాలు గాలికి రోడ్డుపైకి కొట్టుకువచ్చాయి. రోడ్లు, విద్యుత్ వైర్లపై పడిన చెట్ల ను విద్యుత్ శాఖ పట్టణ ఏఈ సంతోష్ కుమార్, రూరల్ ఏఈ అనిల్ ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే ప్రయత్నాలు చేశారు. పెద్ద మొత్తంలో చెట్లు.. విద్యుత్ స్తంభాలపై పడడంతో మంగళవారం ఉదయం వాటిని తొలగించారు. కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. తెగి పడ్డ విద్యుత్ వైర్లను ట్రాన్స్కో సిబ్బంది సరిచేశారు. సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజు, గౌస్‌ను ప్రజలు అభినందించారు. బాన్సువాడ మండలంలోని కొల్లూర్, సోమేశ్వర్, వాసుదేవ్‌పల్లి, నాగారం, ఇబ్రహీంపేట్, హన్మాజీపేట్, బుడ్మి గ్రామాల్లోని పలు చోట్ల చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలువురి ఇంటిపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో తెగిపడిన విద్యుత్ వైర్లను ట్రాన్స్కో సిబ్బంది సరిచేశారు. మంగళవారం సాయంత్రం సింగిల్ ఫేస్ కరెంటు సరఫరాను ప్రారంభించారు. సుమారు 24 గంటలపాటు కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో వీచిన ఈదురు గాలులకు నస్రుల్లాబాద్ -తిమ్మాపూర్ ప్రధాన రహదారిపై వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



బాన్సువాడలోని చైతన్య కాలనీలో విద్యుత్ వైర్లపై పడిన చెట్టును తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



హాజీపూర్ వద్ద రోడ్డుపై కూలిన ఇప్పచెట్టు



లింగంపేట-ఎల్లారెడ్డి రహదారిపై పడిన చెట్టు

## ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



జిల్లా కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు

కామారెడ్డి, జూన్ 10 : తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులు, డైరెక్టర్ ఐపీఎం డాక్టర్ శివలీల ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్ రోహిత్‌రెడ్డి, శ్రీశిక, స్వాతి, జగన్నాథ్‌తో కూడిన బృందం జిల్లా కేంద్రంలో, సదాశివనగర్ మండలంలోని పోసానిపేట్ మిల్, హోటళ్లను మంగళవారం తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో తినుబండారాల వ్యాపారులు, హోటల్ యజమానులు శుభ్రతను పాటించాలని సూచించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. పలు హోటళ్లలో అపరిశుభ్రంగా నిల్వ ఉన్న వాటిని పరిశీలించి దుర్వాసన రావడంతో వారికి నోటీసులు ఇచ్చారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. నిబంధనలు పాటించని, ప్రభుత్వ అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమెదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్ కుమార్

కామారెడ్డి, జూన్ 10 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి, రెండో సంవత్సర డిగ్రీ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, నియంత్రణపై మంగళవారం అవగాహన కార్యక్రమంతోపాటు క్విజ్, చర్చ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం, నియంత్రణపై ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందని అన్నారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణ కన్వీనర్లు డాక్టర్ విశ్వప్రసాద్, శ్రీనివాస్‌రావు, కవిత, తబస్‌బేగం, అనిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న నస్రుల్లాబాద్ ఈవో చందర్

నస్రుల్లాబాద్, జూన్ 10 : విద్యార్థులకు నాణ్యమైన, రుచి కరమైన భోజనం అందించాలని ఎంఈవో చందర్ అన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నాణ్యమైన సరుకులతో వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి వండాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

## వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నస్రుల్లాబాద్, జూన్ 10 : నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో అధికారులు మంగళవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు కురుస్తుండడంతో టైఫాయిడ్, మలేరియా వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటి వద్ద నీటిని నిల్వ ఉంచకూడదని, వంట పాత్రలను శుభ్రం చేసుకుని వండుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి దయానంద్, ఎంపీడీవో సూర్యకాంత్, గ్రామ కార్యదర్శి రాజేశ్, ఏఎన్ఎం వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

## త్రైమాసిక పన్ను చెల్లించాలి

బాన్సువాడ, జూన్ 10 : జిల్లా రవాణశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం బాన్సువాడ డివిజన్ పరిధిలో ఉన్న ప్రైవేట్ వాహనదారులు త్రైమాసిక పన్ను చెల్లించాలని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బాన్సువాడలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. త్రైమాసిక పన్ను ఈ సేవా, మీ సేవ, లేదా మొబైల్ ద్వారా చెల్లించాలని సూచించారు. పన్ను చెల్లించని యెడల తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నందున స్కూల్ బస్సు యజమాన్యాలు ఆర్టీవో కార్యాలయంలో పిట్‌మెంట్ చేయించుకోవాలని చెప్పారు. ఆ తర్వాతనే పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లాలని సూచించారు. లేని యెడల తనిఖీలు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## రెండు ట్రాక్టర్ల పట్టివేత

బాన్సువాడ, జూన్ 10 : బీర్కూర్ మండలంలోని చెంచెల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం ఉదయం బాన్సువాడ పట్టణ సీఐ అశోక్ పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

బాన్సువాడ, జూన్ 10 : పట్టణంలోని కేసీఆర్ కాలనీలో మంగళవారం మొదటి అంతస్తు నుంచి కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు ప్రభు(55) కిందపడడంతో తల పగిలి మృతి చెందినట్లు పట్టణ సీఐ అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ప్రభు మెట్ల పైనుంచి కిందకు దిగుతున్న క్రమంలో వీచిన ఈదురు గాలులకు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన



లింగారెడ్డిపేట్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట/పెద్దకొడప్‌గల్ (పిట్లం), జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామని ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వడ్డే వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్, గూడెం పరిసర ప్రాంతాల్లో వారు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యాబోధన, దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు వివరించారు. లింగంపేట, సజ్జన్‌పల్లి, పోల్కంపేట, కన్నాపూర్, లింగంపల్లి తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బడిఈడు పిల్లల వివరాలను నమోదు చేసుకున్నారు. పిట్లం మండలంలోని తిమ్మానగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ మండలంలో అధికారుల పర్యటన

నిజాంసాగర్, జూన్ 10 : మండలంలోని అచ్చంపేటలో ఎస్టీ హాస్టల్‌ను మండల ప్రత్యేక అధికారి శ్రీమతి ప్రమీల సందర్శించారు. హాస్టల్‌లో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. తర్వాత నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. అనంతరం బంజేపల్లి జీపీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. తర్వాత కస్తూర్బా విద్యాలయాన్ని సదర్శించారు. ఆమెవెంట ఎంపీడీవో గంగాధర్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
PASSPORT LOST
★ I, KOMANPALLY LAXMAN S/o. KOMANPALLY NADIPI GANGARAM, R/o. H.No.3-53, Vill: Sunket, Mdl: Morthad, Dist. Nizamabad, T.S. నా పాస్‌పోర్ట్ నెం.G8452509 Date of Issue:25-04-2008, Dated of Expiry 24-04-2018 Place of Issued Hyderabad. నేను 03-03-2025 రోజున సుంకెట్ నుండి మోర్తాడ్ బైక్‌పై వెళ్ళుచుండగా పడిపోయినది. ఎవరికైన దొరికినచో సం|| 8096384508.
NTZ-338666
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# వసతి గృహాల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్, జూన్ 10: పట్టణంలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీటిలో దోమలు విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నదని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిలిచిన నీటిలో ఆయిల్‌బాల్స్ వేయించాలని డీఎల్పీవో సురేందర్ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని కేజీబీవీ పాఠశాల, ఎస్సీ బాలికల వసతిగృహాన్ని డీఎల్పీవో, మైనారిటీ గురుకుల పాఠశాలను ఎంపీడీవో ప్రకాశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని వసతిగృహాల్లోని సౌకర్యాలను పరిశీలించామన్నారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నదన్నారు. వసతిగృహాలకు సంబంధించిన విద్యుత్ సౌకర్యాలు, డార్మెటరీ గదులు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, వంటగది, డైనింగ్‌హాల్, పాఠశాలలోని పరిసరాల పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో ప్రకాశ్ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశానన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని అంశాలను పరిశీలించి, సిబ్బందికి తగిన సలహాలు ఇచ్చానని పేర్కొన్నారు.

**వసతి గృహాలను తనిఖీ చేసిన ఎంపీడీవో**

నాగిరెడ్డిపేట, జూన్ 10: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ, ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని మంగళవారం ఎంపీడీవో ప్రభాకర్ తనిఖీ చేశారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో పరిసరాలు, గదులు, మూత్రశాలలు, మురుగుదొడ్లు పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని వార్డెన్ రాములుకు సూచించారు. ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వార్డెన్‌కు సూచించారు.



ఎల్లారెడి కేజీబీవీలో వంటగదిని పరిశీలిస్తున్న డీఎల్పీవో సురేందర్

**విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి**

లింగంపేట, జూన్ 10: ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నందున గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో సురేందర్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా, మైనార్టీ గురుకుల పాఠశాలను మంగళవారం డీఆర్డీవో సురేందర్, ఎంపీడీవో నరేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని, వంట శాలలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు.



కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థుల దుస్తులను అందిస్తున్న డీఆర్డీవో

# మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అవగాహన

నిజాంసాగర్/నాగిరెడ్డిపేట/రామారెడ్డి(సదాశివనగర్)/లింగంపేట, జూన్ 10 : ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఒక రోజు అవగాహన కార్యక్రమం ఎంఈవోల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, మండలంలోని పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈవో అమర్‌సింగ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు. పాఠశాలల్లో వంట చేసే సమయంలో ప్రతి పనిలో పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో ప్రభాకర్, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో గోపాల్‌పేట, తాండూర్ కాంప్లెక్స్ స్థాయి హెచ్ఎంలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ తరగతుల్లో పాల్గొని వారు మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్పీ గణేశ్, ఆయా గ్రామాల హెచ్ఎంలు పాల్గొన్నారు.

సదాశివనగర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు కల్వరాల్, ధర్మరావుపేట్ కాంప్లెక్స్ పాఠశాలల్లో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలు, వంట ఏజెన్సీ నిర్వాహకులతో ఎంఈవో యోసెఫ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 12న పాఠశాలలు పున:ప్రారంభంకానుండడంతో విద్యార్థులకు వంట ఏజెన్సీ నిర్వాహకులు ప్రత్యేక పరిశుభ్రత పాటించి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని ఎంఈవో షౌకత్ అలీ సూచించారు. లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు, సహాయకులు, ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నిత్యం నాణ్యమైన కూరగాయలతో రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా కాంప్లెక్స్ పాఠశాలల హెచ్ఎంలు, వంట కార్మికులు, సహాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట పాత్రలను శుభ్రంగా నీళ్లతో కడిగి వాడాలని ఎంఈవో రామస్వామి సూచించారు. మంగళవారం తాడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు తయారుచేసే మధ్యాహ్న భోజనంలో నాసిరకం పదార్థాలు వాడవద్దన్నారు. నిల్వ చేసిన ఆహారపదార్థాలు, నీటిని వాడకుండా ఎప్పటికప్పుడూ తెచ్చిన తాజా ఆహార పదార్థాలు, తాగునీటిని వాడాలని సూచించారు. ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఒక రోజు అవగాహన కార్యక్రమం ఎంఈవోల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, మండలంలోని పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈవో అమర్‌సింగ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో అవగాహన కల్పించారు.



ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న లింగంపేట ఎంఈవో రామస్వామి



మహ్మద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోమాట్లాడుతున్న ఎమ్ఈవో అమర్‌సింగ్

## కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ

లింగంపేట(తాడ్వాయి), జూన్ 10: తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ కొనసాగుతున్నదని ఎంఏవో నర్సింహులు తెలిపారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈవోలు రైతుల వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని తాడ్వాయి, చిట్యాల, కృష్ణాజివాడి, బ్రాహ్మణ్‌పల్లి, ఎర్రాపహాడ్, కరడ్‌పల్లి గ్రామల్లోని క్లస్టర్‌లలో విధులు నిర్వహిస్తున్న ఏఈవోలు గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

## నిత్యం పారిశుద్ధ్య పనులు కొనసాగించాలి

లింగంపేట, జూన్10: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిత్యం కొనసాగించాలని ఎంపీడీవో నరేశ్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం డ్రై డే సందర్భంగా అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ముస్తాపూర్, ఒంటర్‌పల్లి, కొయ్యగుండు తండాల్లో పారిశుద్ధ్య పనులను ఎంపీవో మల్హరీ పరిశీలించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 10: ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని 11వ వార్డులో ఆయన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టారు. దీనిలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ తడి-పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు. ఆయనతో పాటు వార్డు ఆఫీసర్‌లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## అభివృద్ధి పనులపై సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 10: అలయంలో చేసే అభివృద్ధి పనులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఒంటరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉక్కల్‌కర్ రాజేందర్‌నాథ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలయాన్ని వెంటనే దేవాదాయశాఖ పరిధిలో నమోదు చేయించాలని, లీకేజీ అవుతున్న స్లాబులకు మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయపూజారి ముత్యాల శ్రీనివాసరావు, చంద్రం గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌విగ్రహానికి వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 10: సాక్షి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును టీడీపీ ప్రభుత్వం అరెస్ట్ చేయడంపై పట్టణంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జర్నలిస్టు సంఘం నాయకులు రాజ్‌కుమార్, రాజేందర్‌నాథ్, శివకుమార్, మహేశ్, యశ్వంత్‌కుమార్, గౌస్, హస్నొద్దీన్, శంభు, ముఖ్రం, బన్సీలాల్ తదితరులున్నారు.

## రాఘవపల్లి గ్రామాన్ని సందర్శించిన డీఎల్పీవో

నాగిరెడ్డిపేట, జూన్ 10: మండలంలోని రాఘవపల్లి గ్రామాన్ని మంగళవారం డీఎల్పీవో సురేందర్ సందర్శించారు. ప్రధాన వీధుల్లో తిరిగి పరిసరాలను పరిశీలించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని, సేకరించిన చెత్తను ప్రతిరోజూ డంప్‌యార్డుకు పంపించాలని కార్యదర్శి జానకికి సూచించారు. అనంతరం ఇందిరమ్మ పథకంలో ప్రారంభించిన ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు.

## ఏకరూప దుస్తుల పరిశీలన

నాగిరెడ్డిపేట, జూన్ 10: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సిద్ధం చేస్తున్న ఏకరూప దుస్తులను మంగళవారం ఎంపీడీవో ప్రభాకర్ పరిశీలించారు. నాణ్యతను తనిఖీ చేశారు. వివరాలను ఐకేపీ ఏపీఎం జగదీశ్‌ను అడిగి తెలుసుకున్నారు.